క్లుప్తంగా

అటవీ భూములపై విచారణ



అమ్మన్నాయుడుతో కలిసి మాట్లాడుతున్న విజిలెన్స్ డీఎఫ్ఓలు

పాతపట్నం: మండలంలోని అంతరాబ రెవెన్యూ పరిధిలో గల అటవీశాఖ భూముల ఆక్రమణలపై మంగళగిరి అటవీశాఖ కార్యాలయ కమిషనర్‌కు గతంలో ఫిర్యాదు అందింది. దీనిపై విజయవాడకు చెందిన విజిలెన్స్ డీఎఫ్ఓలు సీహెచ్ ధర్మా రక్షిత్, ఎస్.ఎస్.శివకుమార్ గురువారం పాతపట్నం ఫారెస్ట్ కార్యాలయంలో ఫారెస్ట్ రేంజర్ అమ్మన్నాయుడుతో కలిసి విచారణ చేపట్టారు. అనంతరం అంతరాబ రెవెన్యూ పరిధి ఫారెస్ట్‌కు చెందిన భూములను పరిశీలించారు. ఫారెస్ట్ రేంజర్ మాట్లాడుతూ ఫారెస్ట్, రెవెన్యూకు సంబంధించిన భూములు కలిసి ఉన్నాయన్నారు. అందువల్ల రెవెన్యూ అధికారులు, ఫారెస్ట్ అధికారులు కలిసి జాయింట్ ఆపరేషన్‌లో పనిచేయాల్సి ఉందన్నారు. రెవెన్యూ అధికారులకు తెలియజేసి భూములకు కొలతలు వేయనున్నట్లు చెప్పారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి యతీశ్వరరావు, ఉమామహేశ్వరరావు, ప్రవీణ్ ఉన్నారు.

పట్టు పరిశ్రమతో అధిక ఆదాయం



రాపాకలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పొందూరు: పట్టు పరిశ్రమంలో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులను సాధించి రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చునని జిల్లా పట్టు పరిశ్రమ అధికారి టి.రాజేంద్రప్రసాద్‌బాబు అన్నారు. పొందూరు మండలంలోని రాపాక, మలకాం గ్రామాల్లో గురువారం పట్టు సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురంలోని ఏపీ ప్రభుత్వం పట్టు పరిశోధన మండలి శాస్త్రవేత్తలు డాక్టర్ సి.రమేష్, డాక్టర్ జె.సీతారాములు మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు మొదలుకొని, అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు ఎంపిక, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చునన్నారు. అనంతరం పలు సాగు పద్ధతులపై శిక్షణను రైతులకు అందజేశారు. ఎంపీడీఓ మీసాల మన్మధరావు, ఏపీఓ శ్రీనివాసరావు, ప్రొఫెసర్లు అనిత, కిరణ్మయి పాల్గొన్నారు.

చాపర సచివాలయం సందర్శన



చాపర సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ గోపీబాల

మెళియాపుట్టి: ఇంటి పన్నుల వసూలు, పంచాయతీలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని డీఎల్‌పీఓ గోపీబాల అన్నారు. గురువారం చాపర సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. వీధి దీపాల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామంలో చెత్తసేకరణ జరగాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. కార్యదర్శి అప్పారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ముమ్మర తనిఖీలు



జాగిలంతో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

హిరమండలం: మండల కేంద్రంలో స్థానిక ఎస్ఐ ఎండీ యాసిన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీస్ సిబ్బంది గురువారం జాగిలంతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. న్యూబ్యారేజీ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

పీఎం సూర్య ఘర్‌పై అవగాహన

హిరమండలం: పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్, విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవచ్చున్నారు. ఈ పథకం కింద జాతీయ బ్యాంకులు 80 శాతం రుణాన్ని అందిస్తాయన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కూటమి కార్యకర్తలకు.. కాసుల పంట!

● కోట్ల వ్యయం.. లక్ష్యం శూన్యం ● నాసిరకంగా రోడ్డు పనులు చేస్తూ లక్షల్లో బిల్లుల స్వాహా..



సరుబుజ్జిలి: పూర్తికాని ఆమదాలవలస- పురుషోత్తపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు

సంక్రాంతి లోగా రోడ్లను అద్దంలా తయారు చేస్తామని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని సీఎం చంద్రబాబు నాయుడు గతేడాది సెప్టెంబర్‌లో అనేక వేదికలపై నుంచి ఊదరగొట్టారు. వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. కూటమి నాయకులు, కాంట్రాక్టర్లు కలిసి రోడ్ల పనులకు టెండర్లు పాడి నాసిరకంగా పనులు చేపడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పలుచోట్ల రోడ్లు వేయడం లేదని, వేసినచోట నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆమదావలసలో నిర్వహిస్తున్న రహదారి పనులు అన్నీ ఒక్కరికే కట్టబెట్టారని, వారికి నచ్చిన విధంగా బిల్లులు చేయించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆమదాలవలస నుంచి గాజులకొల్లివలస మీదుగా సైలాడ, చిట్టివలస వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో 6 కిలో మీటర్లు పొడవున గోతులు పూడ్చేందుకు రూ.4.95 లక్షలతో పనులు చేపట్టారు. ఈ పనులు తూతూ మంత్రంగా చేస్తుండటంతో వెంటనే రాళ్లు తేలిపోయాయి. ఆమదాలవలస నుంచి పురుషోత్తుపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో స్థానిక రైల్వే గేటు సమీపం నుంచి పొన్నాంపేట, రామచంద్రపురం, చెవ్వాకులపేట వరకు 6 కిలో మీటర్ల మేర గోతులు పూడ్చేందుకు రూ.95 లక్షల నిధులతో 50 రోజుల క్రితం పనులు ప్రారంభించారు. ఈ పనులు ప్రారంభించిన రెండు రోజు రహదారిలో పలుచోట్ల జేసీబీతో తవ్వి విడిచిపెట్టారు. ఎక్కడ గోతులు అక్కడే ఉన్నాయి. బూర్జ, సరుబుజ్జిలి, పొందూరు మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని ఆయా మండలాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్ల మరమ్మతులు కూటమి కార్యకర్తలకు మేలు చేయడానికా, రోడ్లు బాగు చేయడానికా అని అధికారులు, కూటమి పెద్దలకు ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- సాక్షి నెట్‌వర్క్

రోడ్లను వెంటనే పూర్తిచేయాలి



ఆమదాలవలస నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారుల గోతులు పూడ్చేందుకు చేపట్టిన పనులు వెంటనే పూర్తిచేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలను మభ్యపెట్టేందుకు సంక్రాంతి లోగా రహదారి నిర్మాణాలు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరులే పనులు చేపడుతున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా రోడ్లు వేస్తున్నారు. రహదారుల్లో కొద్దిరోజులకే రాళ్లు తేలుతున్నాయి. పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలి.

– చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త



ఆమదాలవలస: గోతులు పూడ్చిన కొద్ది రోజుల్లోనే పిక్కలు తేలిన కొల్లివలస ఆర్‌అండ్‌బీ రోడ్డు



ఆమదాలవలస: పనులు చేపట్టకుండా విడిచిపెట్టిన ఆమదాలవలస-పురుషోత్తపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఆమదాలవలస నియోజవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల వివరాలు ఇలా..

మండలం	రోడ్లు	మరమ్మత్తులు చేస్తున్నవి	మంజూరైన నిధులు
ఆమదాలవలస	4	2	రూ.1.02 కోట్లు
సరుబుజ్జిలి	6	2	రూ.2.90 కోట్లు
బూర్జ	7	7	రూ.25 లక్షలు
పొందూరు	3	3	రూ.11.20 లక్షలు

ఆమదాలవలస నియోజవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్ల వివరాలు ఇలా..

మండలం	పంచాయతీలు	రోడ్లు	మంజూరైన నిధులు
ఆమదాలవలస	30	96	రూ.8.83 కోట్లు
సరుబుజ్జిలి	21	60	రూ.3.72 కోట్లు
బూర్జ	30	70	రూ.5.35 కోట్లు
పొందూరు	14	89	రూ.14.49 కోట్లు



ఆమదాలవలస: సైలాడ, కొల్లివలస, చిట్టివలస రహదారిలో అధికారుల పర్యవేక్షణ లేకుండా పనులు చేస్తున్న దృశ్యం



సరుబుజ్జిలి: చినషలంత్రి జంక్షన్ వద్ద రాళ్లుతేలిన అలికాం-బత్తిలి ఆర్‌అండ్‌బీ రోడ్డు



బూర్జ: బూర్జ నుంచి పెద్దలంకాం వరకు నాణ్యతలేని రోడ్డు మరమ్మతు పనులు

సంక్రాంతి సందడి



పాతపట్నం: విజ్ఞాన్ స్కూల్‌లో వివిధ వేషధారణల్లో చిన్నారులు

నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్రాలు ధరించి సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలు చేస్తూ అలరించారు. హరిదాసులు, డూ డూ బసవన్నల వేషధారణల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. భోగీ మంటలు వేశారు. సంక్రాంతి విశిష్టతను వక్తలు వివరించారు. ముగ్గులు, డ్యాన్స్, తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. పలు గ్రామాల్లో హరిదాసులు, డూ డూ బసవన్నలు సందడి చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: కాగితాపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో వివిధ వేషధారణలతో సందడి చేస్తున్న విద్యార్థులు



జలుమూరు: హరినామ సంకీర్తనలతో హరిదాసు



పొందూరు: భాష్యం స్కూల్లో బొమ్మల కొలువు



ఎల్.ఎన్.పేట: సంక్రాంతి ముగ్గులు వేస్తున్న కేజీబీవీ విద్యార్థులు



నరసన్నపేట: ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో జానపద గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థులు



ఆమదాలవలస: అశోక పబ్లిక్ స్కూల్‌లో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు



నరసన్నపేట: డిగ్రీ కళాశాలలో భోగీ మంట వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



జలుమూరు: డూ డూ బసవన్నల సందడి



ఎల్.ఎన్.పేట: భోగీ మంటను వెలిగించిన ఎస్‌వీ స్కూల్ విద్యార్థులు



ఆమదాలవలస: తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదాయ దుస్తుల్లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు



కొత్తూరు: కొత్తూరులోని రాజ్‌శ్రీనివాస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



కొత్తూరు: సిరువాడ ఎంపీపీ పాఠశాలలో భోగీ మంట వేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఇప్పుడు ఏ దీక్ష చేస్తారు?



మాట్లాడుతున్న చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: గతంలో ఎన్నడూ లేనివిధంగా తిరమలలో వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం టోకెన్ల పంపిణీ కార్యక్రమంలో జరిగిన తోపులాటలో ఆరుగురు భక్తులు మృతి చెందిన ఘటన పూర్తిగా కూటమి ప్రభుత్వ వైఫల్యమని కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ భాస్కరరావు అన్నారు. మండలంలోని జీవీపేటలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. గతంలో లడ్డూ తయారీలో జంతువులకు సంబంధించిన కొవ్వు కల్తీ జరిగిందని నిరాధారాలతో ఆరోపించిన కూటమి నేతలు నేడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. లడ్డూ విషయంలో అపచారం జరిగిందని ఉప ముఖ్యమంతి పవన్ కల్యాణ్ అప్పట్లో దీక్ష చేశారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వ తప్పిదం వల్ల ఒకేసారి ఆరుగురు మృతి చెందడంతో పవన్ కల్యాణ్ ఏ దీక్ష చేస్తారని ప్రశ్నించారు. ఈ ఘటనపై టీటీడీ పాలక మండలి, కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ యర్లంకి ధర్మారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరరావు, లింగం, జి.నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయ సమస్యలపై మౌనం సరికాదు

● ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి



మాటాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి

ఆమదాలవలస: ఉపాధ్యాయుల సమస్యలపై కూటమి ప్రభుత్వం మౌనం సరికాదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. ఆమదాలవలస ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రాంతీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రోజురోజుకూ ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగిస్తున్నారన్నారు. దీనివల్ల ప్రభుత్వ విద్య కుంటుపడుతోందని ఆవేదన చెందారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ డీఏల ఊసే లేదని, 11వ వేతన సవరణ ముగిసి 17 నెలలు కావస్తున్నా.. 12వ పీఆర్సీ చైర్మన్ నియామకమే చేయలేదన్నారు. ఐఆర్ ప్రస్తావనే లేదని ప్రతీ శుక్రవారం అధికారులతో మొక్కుబడి సమావేశాలు తప్ప.. ఇంతవరకు కూటమి ప్రభుత్వం ఉద్యోగుల పక్షాన ఒక్క సానుకూల ప్రకటన చేయలేదన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని, లేని పక్షాన కూటమి ప్రభుత్వానికి ఉపాధ్యాయుల ఆగ్రహం తప్పదని హెచ్చరించారు. ఆమదాలవలస రూరల్, అర్బన్, బూర్జ, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ తూలుగు మేనక

హిరమండలం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండలాభివృద్ధికి సహకరించాలని, ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఎంపీపీ తూలుగు మేనక కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2024–25 సవరణ బడ్జెట్, 2025–26 అంచనా బడ్జెట్‌ను ఎంపీడీఓ చదివి వినిపించారు. ఆదాయం రూ.54.60 కోట్లు, వ్యయం రూ.53.55 కోట్లు, మిగులు రూ.1.04 కోట్లుగా సభ్యులు ఆమోదించారు. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలను వివరించారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు టి.తిరుపతిరావు, జెడ్పీటీసీ సభ్యుడు పి.బుచ్చిబాబు, వైస్ ఎంపీపీ వంగపల్లి సావిత్రి, తహసీల్దార్ హనుమంతురావు, సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



ద్విచక్ర వాహనదారులకు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ హైమావతి

ఎల్.ఎన్.పేట: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే అపరాధ రుసుం వసూలు చేయటంతోపాటు కేసులు నమోదు చేయటం జరుగుతుందని సరుబుజ్జిలి ఎస్ఐ బి.హైమావతి హెచ్చరించారు. ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో గురువారం వాహన తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

కన్నీటి వీడ్కోలు



పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పొందూరు: స్థానిక నాయుడువీధికి చెందిన ఏపీఎస్‌బీ హెచ్‌సీ నల్లి వెంకటరమణ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించారు. పాడేరులో ఏపీఎస్‌బీ హెచ్‌సీగా పనిచేస్తున్న వెంకటరమణ బుధవారం పాడేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. పొందూరులో గురువారం ఉదయం దహన సంస్కారాలు చేశారు. అంత్యక్రియల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రిగ్స్ పోటీల్లో సత్తా

పాతపట్నం: నియోజకవర్గ స్థాయిలో జరిగిన గ్రిగ్స్ పోటీల్లో మండలంలోని గంగువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చూపారని హెచ్ఎం పి.వల్లభరావు అన్నారు. ఇటీవల నివగాంలో నిర్వహించిన గ్రిగ్స్ పోటీల్లో అండర్–14 బాలికల, బాలుర విభాగాల్లో టెన్నికాయిట్‌లో ప్రథమ స్థానం, అండర్–14 బాలుర విభాగంలో కబడ్డీలో ప్రథమ స్థానం, జావెలెన్ త్రోలో ద్వితీయ, తృతీయ స్థానాలు, అండర్–17 బాలుర విభాగంలో టెన్నికాయిట్‌లో ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్ఎం తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.



విద్యార్థులతో హెచ్ఎం వల్లభరావు, ఉపాధ్యాయులు

ఇళ్లకు పయనమైన విద్యార్థులు



పెద్దమడి గిరిజన బాలికల వసతి గృహం వద్ద విద్యార్థుల కోసం వచ్చిన ఆటోలు

మెళియాపుట్టి: సంక్రాంతి సెలవులు శుక్రవారం నుంచి ప్రకటించడంతో సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు గురువారం సాయంత్రం ఇళ్లకు వెళ్లడానికి పయనమయ్యారు. మండలంలోని పెద్దమడి వసతి గృహాల వద్ద సందడి కనిపించింది. తల్లిదండ్రులు వారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లడానికి హాస్టళ్ల వద్ద ఆటోలతో బారులు తీరారు. సెలవుల్లో విద్యార్థులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ నెల 20న మళ్లీ పాఠశాలలు పునఃప్రారంభవుతాయన్నారు.

సామూహిక సీమంతం

కొత్తూరు: మండలంలోని కురిగాం పీహెచ్‌సీలో గురువారం సామూహిక సీమంతం నిర్వహించారు. పాతపట్నం మండల కేంద్రానికి చెందిన రామరాజు చారటబుల్ ట్రస్టు చైర్మన్ రామరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీకి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు సీమంతం నిర్వహించి పలు రకాల వస్తువులు అందజేశారు.